

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1616.27	1581.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	30,838	604
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	198	1,995
నీటి నిల్వ (టీఎంసీలు)	52.94	5.13

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ కాళింగ

బళ్లారిరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా గ్రామంలో పీయూ కాలేజీ ఆవరణలో ఎస్ఐ కాళింగ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలని ర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు బానిసలు కాకూడదని మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. గ్రామస్థులు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాళా

● యువ జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్

రాయచూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ఆర్థిక రంగం పూర్తిగా దివాళా తీసిందని యువ జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి ఆరోపించారు. ఇచ్చిన గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం వద్ద నిధులు లేక అబాసుపాలవుతున్నట్లు ఎద్దేవా చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన నిఖిల్ కుమార స్వామి శుక్రవారం పార్టీ నగర అధ్యక్షుడు తిమ్మారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రజల్లోకి వెళ్లేందుకు ముఖం చెల్లడటం లేదని సీనియర్ శాసనసభ్యులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన ఉదహరించారు. మూడేళ్ల కాలం ఉన్నా శాసనసభ ఎన్నికల కోసం తమ పార్టీ ఇప్పటికే సమాయత్తం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగానే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుపొందేలా పార్టీని పటిష్టం చేస్తామన్నారు. కాగా గ్రామ పంచాయతీ, జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం పదే పదే ఆదేశిస్తున్నా ప్రభుత్వానికి చీవాట్లు పెట్టినా పట్టించుకోవడం లేదన్నారు. జనతాదళ్ పాలనలో జిల్లాలోని దేవదుర్గ, లింగసుగూరు తదితర ప్రాంతాల్లో లక్ష 16 వేల హెక్టార్ల ఆయకట్టు ఏర్పడిందని తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ చేసిన కృషేనని అన్నారు.

శాంతియుతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ హనుమంతప్ప

సిరుగుప్ప, జూన్ 27(ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లింలు ఐక్యతగా నిర్వహించే మొహరం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ హనుమంతప్ప సూచించారు. శుక్రవారం పట్టణంలో మొహరం పండుగను పురస్కరించుకుని శాంతిసభ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా మొహరం పండుగను హిందూ ముస్లింలు ఆచరించడం ఆనవాయితీ అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయనతెలిపారు. ఎనిమిది చోట్ల పండుగను నిషేధించినట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు అబ్దుల్ రజాక్, డాక్టర్ మహమ్మద్, అజీజ్, ఖాజా సాబ్, అడివప్ప, ప్రజలు పాల్గొన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బళ్లారిరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి గురువారం పర్యటించారు. మూడవ వార్డులోని మహిళలను తమ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలు ఏమైనా వుంటే తక్షణం మా ఆఫీసుకు వచ్చి తెలపాలని, వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. అలాగే పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమిపూజలు నిర్వహించి నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. మేయర్ నందీష్, మాజీ మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్లు, మించు శ్రీనివాస్, జబ్బార్, బీఆర్ఎల్ శీనాతోపాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాబకోవిని కోల్పోనున్న బళ్లారి..?

● స్థానిక నాయకులకు పట్టని సమస్య
● విజయనగర జిల్లాకు తరలింపు ఖాయమా?



రాబకొవి ప్రధాన కార్యాలయం

బళ్లారి గాంధీనగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం(రాబకొవి) బళ్లారి జిల్లా నుంచి తరలిపోవడం ఖాయని యూనియన్ సభ్యులు చర్చించుకుంటున్నారు. యూనియన్‌లో 12 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నిలకు ఖరారయ్యాయి. ఈసారి జరిగే ఎన్నికల్లో బళ్లారి జిల్లా ప్రాతినిధ్యం కోల్పోయే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. 2024 జూన్‌లో ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించినా, కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం కోర్టు నుంచి స్టే తొలగడంతో రాబకొవి యూనియన్‌కు జులై 10వ తేదీ ఎన్నికలు ఖరారయ్యాయి. ఈ మధ్య రాబకొవిలో పలు నిర్ణయాలు వివాదానికి దారి తీశాయి. యూనియన్ కేంద్ర కార్యాలయాన్ని విజయనగర జిల్లాకు మార్చాలని పన్నాగాలు పన్నుతున్నారని బళ్లారి జిల్లాకు చెందిన రైతులు, పాల ఉత్పత్తిదారుల పోరాట సమితి పోరాటాలు చేసున్నా స్థానిక జిల్లా పాలనా మండలిలో గాని, అధికార, ప్రతిపక్ష నాయకులకు చీమకుట్టినంత నొప్పి లేకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. వీటన్నింటి నడుమ కొత్తగా ఎన్నికల తేదీ ఖరారు కావడం రాబకొవి యూనియన్ ఎన్నికలు ఇరు జిల్లాలకు ప్రతిష్టగా మారింది. యూనియన్‌లో మొత్తం 12మంది డైరెక్టర్ల స్థానాలు ఉన్నాయి. రాయచూరు-4, కొప్పళ-4, బళ్లారి, విజయనగర జిల్లాలకు చేరి 4 స్థానాలు ఉన్నాయి. ప్రతి జిల్లా నుంచి ముగ్గురు సామాన్య అభ్యర్థులు, ఒకరు మహిళా డైరెక్టర్ ఎన్నిక కావాల్సి ఉంది. బళ్లారి నుంచి విజయ నగర జిల్లాగా విడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా రెండు జిల్లాలకు మొత్తం నాలుగు స్థానాలు మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంది. అయితే పరిస్థితిని గమనిస్తే బళ్లారి నుంచి ఒక్కరే యూనియన్‌కు ప్రతినిధిగా ఎన్నికయ్యే పరిస్థితి నెలకొంది. సంఘంలో మొత్తం 857 పాల ఉత్పత్తి సంఘాలు ఉన్నా, ఎన్నికల్లో ఓటు హక్కు మాత్రం 466 సంఘాల ప్రతినిధులకు మాత్రమే ఉండడం గమనార్హం. వీటిలో కొప్పళ జిల్లాకు 154, రాయచూరు-55 ఓట్లు ఉండగా, విజయనగర జిల్లాకు అత్యధికంగా 229 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. విభజిత అనంతరం బళ్లారి జిల్లాలో అత్యంత తక్కువగా కేవలం 28 మందికి మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండడం గమనార్హం. దీంతో అత్యధికంగా ఓటర్లు కలిగిన విజయనగర జిల్లా నుంచి పోటీ చేసే డైరెక్టర్‌లు సునాయసయసంగా 4 స్థానాలు దక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. రెండు అంకెలకు పరిమితైన బళ్లారి జిల్లా నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల్లో గెలవడం కష్టమని తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌లో బళ్లారికి 4 స్థానాలు కేటియించినా ఒకే ఒక్కరు మాత్రం గెలిచే అవకాశం ఉంది. రాబకొవి యూనియన్ కేంద్ర కార్యాలయం బళ్లారి నగరంలో ఉన్నా, ఒక ప్రతినిధిని కూడా పాలనా మండలిలో స్థానం పొందలేని దయనీయ పరిస్థితి నెలకొనడం గమనార్హం. యూనియన్‌లో అసమానతలు ఏర్పడే అవకాశాలు మెండుగా ఉన్న పరిస్థితి నెలకొంది. ఇలా అయితే పాలనా మండలి నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు.

రాజకీయ నాయకుల్లో కొరవడిన ఆసక్తి

ఒకానొక సమయంలో బళ్ళారి జిల్లాలో 170కి పైగా పాల ఉత్పత్తి సంఘాలు ఉండేవి. అవి క్రమేణా 92కి తగ్గిపోయాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 28కి చేరడంతో డైరెక్టర్లను ఎన్నికల సమయంలో బళ్లారి జిల్లాలో కేవలం 28కి మాత్రమే ఓటు హక్కు వినియోగానిక అవకాశం ఉంది. ఇలా అయితే భవిష్యత్‌లో రోజుకు 100 లీటర్లు కూడా పాలు ఉత్పత్తి చేసే శక్తిలేక పోవడంతో పాటు ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి లేకపోలేదు. బళ్లారి జిల్లాలో ఆర్థిక వనరులు ఎక్కువగా ఉన్నా వాటిని వినియోగించుకోవడంలో ప్రజాపాలక మండలి, రాజకీయ ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కారం కనుగొనేందుకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. దీనిని ముందుగానే గమనించి పరిష్కార మార్గాలు వెతికి ఉంటే బళ్లారికి ఇలాంటి దుస్థితి నెలకొనేది కాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



గరగా-నాగలాపురం రోడ్డు మార్గంలో వంతెనపై కూర్చున్న పులి

పులి ఉంది జాగ్రత్త..!

కంప్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా యశ్వంత్‌నగర నుంచి గరగా నాగలాపురం గ్రామ మార్గంలో సాయంత్రం రోడ్డు మార్గంలో వంతెనపై పులి కనిపించింది. నాగలాపురం వెళ్లే వారు రోడ్డు పక్కనే పులి కనిపించడంతో పరుగులు తీశారు. అటవీ ప్రాంతం ఉండటంతో కొద్దిపాటి వర్షం కురుస్తుండటంతో అడవుల్లో ఉన్న ఎలుగుబంట్లు, పులులు తరచుగా కనిపిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అడవుల్లో నుంచి గ్రామాలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లేందుకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో నామఫలకాలు రోడ్డు పక్కన కంచెలు ఏర్పాటు చేయాలని ఫారెస్టు అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన ఓబుళపతి, పదాధికారులు

వీవర్స్ ప్రొడక్షన్, సేల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ
అధ్యక్షుడిగా ఓబుళపతి

బళ్లారి సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలో లిమ్రా పట్టు, పత్తి చేనేత వస్త్రాల వీవర్స్ ప్రొడక్షన్, సేల్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఓబుళపతి ఎన్నికయ్యారు. 25 సంవత్సరాల క్రితం రిజిస్టర్ చేసిన ఈ సంఘం కంటోన్మెంట్ ప్రాంతంలోని ఒక చిన్న గోడౌన్‌లో కేవలం 70మంది సభ్యులతో ప్రారంభమైంది. ప్రస్తుతం 686మంది సభ్యులు ఉన్నారు. సంవత్సరాలుగా సంఘ కార్యాలయం శిధిలావస్థకు చేరుకుంది. మంజునాథ్, వీరాంజనేయుల సలహాలు సూచనల మేరకు ఓబుళపతి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఓబుళపతి మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా నిర్వహణ లేకుండా సంఘం నిద్రావస్థలో ఉందన్నారు. అందరం కలిసి సంఘాన్ని పునరుద్ధరించామన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు అందించే సౌకర్యాలను ఈ సంఘం ద్వారా సంఘం సభ్యులకు సౌకర్యాలు కల్పించడానికి ప్రయత్నిస్తానన్నారు. సంఘం కార్యదర్శిగా వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లుగా అర్జునరెడ్డి, సరస్వతి, కళావతి, నగేశ్ ఎన్నికయ్యారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం

● ఎమ్మెల్యే భరత్ రెడ్డి, మేయర్ నందీష్‌బాబు



మాట్లాడుతున్న మేయర్ నందీష్‌బాబు

బళ్లారి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు అవసరమని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ నందీష్ బాబు అన్నారు. శుక్రవారం బళ్లారిలోని వీరశైవ కళాశాల మైదానంలో బళ్లారి జిల్లా కర్ణాటక కార్యనిరత పత్రకర్తర సంఘం తరుపున ఒక రోజు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎమ్మెల్యే, మేయర్‌తోపాటు మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు, కాంగ్రెస్ పార్టీ మీడియా ప్రచారకర్త వెంకటేశ్ హేగ్డే పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ మీడియా రంగంలో ఉంటూ ఎప్పుడూ అనేక ఒత్తిళ్లు ఎదుర్కొనే పాత్రికేయులు క్రీడల ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కూడా ఒక టీంగా ఏర్పడి క్రికెట్ ఆడేందుకు ఒక టీంను రెడీ చేస్తామని వారన్నారు. క్రీడలు మనిషిలో స్నేహభావాన్ని పెంచుతాయని, అలాగే ఆరోగ్యం, పట్టుదల పెరుగుతాయన్నారు. యువ జర్నలిస్టులు ముందుకొచ్చి సమాజంకోసం పని చేయాలని, మాలాంటి వారికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. కర్ణాటక కార్యనిరత పత్రకర్తత రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరభద్రగౌడ మాట్లాడుతూ జిల్లాలో పాత్రికేయుల సంక్షేమం కోసం నిధి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధిని జర్నలిస్టుల సంక్షేమం కోసం వినియోగిస్తునమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, మేయర్ క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు.

విజేత జట్టుకు రూ.1.5 లక్షల బహుమతి

క్రికెట్ పోటీల్లో విన్నర్ జట్టుకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు నగదు బహుమతిని ఎమ్మెల్యే అందించారు. జిల్లా నుంచి నాలుగు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బళ్లారి టైగర్స్, బళ్లారి లయన్స్, కేకే బుల్స్, సిరుగుప్ప సిరిగేరి ఎలెవెన్స్ జట్లు పాల్గొన్నారు. కేకే బుల్స్ విన్నర్స్ కాగా బళ్లారి లయన్స్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే నగదు బహుమతి అందించారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

రుణాల కోసం దరఖాస్తులు

హొస్పేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్యవైశ్య కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2025-26సంవత్సరానికి వివిధ పథకాలకింద రుణ సౌకర్యాలు పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు కర్ణాటక ఆర్యవైశ్య కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ హొన్నూరప్ప తెలిపారు. సీఈటీ, ఎన్ఈఈటీ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి ప్రత్యేక్ష రుణ పథకం, బ్యాంకుల సహకారంతో ఆర్య వైశ్య ఆహార్ వాహిని పథకం, వాసవి జలశక్తి పథకం, అరివు విద్యారుణ పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయనతెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. జూలై 31 లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు జనరల్ కేటగిరిలో ఆర్య వైశ్య సమాజానికి చెందినవారు అయి ఉండాలి, ఫారం-జీలో కుల, ఆదాయ, ధృవీకరణ పత్రం ఉండాలి, అర్హులైన దరఖాస్తుదారులను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అధ్యక్షతన జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తారని తెలిపారు. 2019-20 సంవత్సరం నుంచి 2021-22 వరకు స్వయం ఉపాధి ప్రత్యేక రుణ పథకం కింద రుణాలు తీసుకొని సకాలంలో పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించిన లబ్ధిదారులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్ 9448451111కు కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ మార్గదర్శకాలు, సమర్పించాల్సిన పత్రాలు, జిల్లా మేనేజర్ కార్యాలయ చిరునామాలతో సహా అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చని ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హొస్పేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సంక్లాపూర్ 110/11కేవీ విద్యుత్ పంపిణీ కేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హొస్పేట తాలుకాలోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని 11కేవీ ఫీడర్లు ఎంపి ప్రకాష్, బసవదుర్గ (ఎన్‌జేవై), ఎంపీ ప్రకాష్‌నగర్, అనంతశయన గుడి, కొండనాయకనహళ్లి, కరిగనూరు, మారుతీనగర్, సాయికాలనీ, సంక్లాపూర్ ఏరియా, నాగేనహళ్లి, బసవదుర్గ, హొసూరు, ఇప్పిటేరి, మాగాణి, నరసపూర్, 118దానాపూర్, 88ముద్లాపూర్‌లలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పలు ప్రాంతాల్లో మొహర్రంపై నిషేధం

బళ్లారి గాంధీనగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో మొహర్రంను నిషేధించినట్లు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పండుగ నేపథ్యంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా బళ్లారి నగరంలోని గాంధీనగర్ పోలీసు స్టేషన్ వ్యాప్తిలో తాళూరు రోడ్డు, కన్నడ, కన్నడ నగర ప్రధాన రోడ్డు(న్యాయమూర్తుల వసతి గృహం కాంపౌండ్ పక్కన) మహానంది కొట్టం లోపల, సిరుగుప్ప పోలీసు స్టేషన్ పరిధిలో కెసూగూరు, ముదేనూరు, హిరేహాల్, నాడంగ, బంద్రాల్, దేశనూరు, కెబెళగల్లు, అలబనూరు గ్రామాలు, తెక్కలకోట పోలీసుస్టేషన్‌వ్యాప్తిలో తెక్కలకోట, హళేకోటె, ఉప్పరహొసళ్ళి, ఉడేగోళ, అరళిగనూరు గ్రామాల్లో మొహరం పండుగ నిషేధించినట్లు కలెక్టర్ తెలిపారు. సిరిగేరి పోలీసు స్టేషన్ పరిధిలో నంబర్ 15 15 గోనాళ గ్రామంలో నిషేధం విధించామన్నారు. కర్ణాటక పోలీసు చట్టం 1963 కలం(35) కింద బందూరు, కత్తి, లాఠి, లేదా శరీరానికి గాయపరిచే వస్తువులు ఉపయోగించరాదన్నారు. వ్యక్తుల భావచిత్రాలు అవమానకర రీతిలో ప్రదర్శించరాదన్నారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



కెంపేగౌడ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

సిరుగుప్ప, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహానగరం అభివృద్ధిలో కెంపేగౌడ పాత్ర ఎంతో వుందని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో కెంపేగౌడ జయం తి వేడుకలు నిర్వహించారు. ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున మాట్లాడుతూ.. కెంపేగౌడ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రధానంగా బెంగళూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ఎంతో వుందన్నారు. కార్యక్రమంలో వార్డన్ మహమ్మద్ నౌషాద్ అలీ, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు శుద్ధజలాన్ని అందించాలి

● పంచాయతీ కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్



నీటి ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు శుద్ధ నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్ సూచించారు. శుద్ధినీరు కలుషితం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి తాలూకా కార్యనిర్వాహక అధికారులు, గ్రామీణ తాగునీటి ప్రాజెక్టు అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నీటి తొట్టెలు, ట్యాంకులు, ఆర్ఓ యూనిట్లను వ్యక్తగతంగా పరిశీలించి సర్వే చేసి 10 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అదనంగా నీటి వనరులతో నిల్వచేసిన నీటి నమూనాలను పరీక్షించడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ స్థాయిల్లో పీడీఓలు, అధికారులు నీటి వనరుల పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగు నీరు అందుబాటులో ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చేపల పెంపకంపై మహిళలకు శిక్షణ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ డిప్యూటీ కార్యదర్శి గిరిజాశంకర్ తదితరులు

బళ్లారి సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఏర్పడిన స్వయం సహాయక బృందంలోని మహిళలకు 10 రోజుల చేపల పెంపకం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బళ్లారిలో శుక్రవారం జిల్లా పంచాయతీ డిప్యూటీ కార్యదర్శి గిరిజా శంకర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు తమ ఖాళీ సమయంలో వ్యవసాయ కార్యకలాపాలతో పాటు చెరువులలో చేపల పెంపకం చేయాలని, ఇది వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సహాయపడుతుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివన్న పాల్గొని వారికి చేపలు ఆరోగ్యానికి మంచి ఆహారం, శరీరంలోని కొలెస్ట్రాల్‌ను సమతుల్యంగా ఉంచుతాయని చెప్పారు. దీనిని మందుల తయారీలో ఉపయోగిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా పంచాయతీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజాసాబు, ఎరిమణి డైరెక్టర్, కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బళ్లారి, రాజేంద్ర, విజయకుమార్, రఘువర్మ, పంచాయతీ సిబ్బంది దినేశ్, లెక్చరర్ సిద్దలింగమ్మ, సంతోష్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 2, 3వ తేదీల్లో బళ్లారి రాఘవ మెమోరియల్ అసోసియేషన్ రా ష్ట్రస్థాయిలో కన్నడ, తెలుగు నాటక కళాకారులకు అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు చైర్మన్ కోటేశ్వరరావు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయి అవార్డులు కళాకారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలోని నాటక కళాకారులు జూలై 15వ తేదీలోగా నాటక ప్రదర్శనను వివరించే బయోడేటాను అధ్యక్షుడు లేదా కార్యదర్శి రాఘవ కళామందిర్, డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు, బళ్లారికి పంపాలని కోరారు. కళాకారుడి వయస్సు 50 ఏళ్లపైబడి ఉండాలి, కనీసం 20 సంవత్సరాలు నాటకరంగంలో అనుభవం ఉండాలి. వివరాలకు 9448124243 నంబరులో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

హొసూరు జోన్

ఇన్నోవేషన్ లర్నింగ్ సెంటర్ల ప్రారంభం

రూ.4.44 కోట్లతో ఏర్పాటు: మంత్రి అన్బిల్ మహేష్

హొసూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి, హొసూరు విద్యా జిల్లాలోని 16 పాఠశాలల్లో రూ.4.44 కోట్లతో ఏర్పాటు చేసిన స్టెమ్ ఇన్నోవేషన్ అండ్ లర్నింగ్ సెంటర్లను ప్రాథమిక విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామోజి ప్రారంభించారు. శుక్రవారం కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, ప్రాథమిక విద్యా డైరెక్టర్ నరేశ్ పాల్గొన్నారు. మంత్రి అన్బిల్ మహేశ్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యాశాఖ, అమెరికా ఇండియా ఫౌండేషన్ సంయుక్త చొరవతో జిల్లాలోని అలపట్టి, చిన్నమేలుపల్లి, కెఆర్‌పి సహా మొత్తం 16 పాఠశాలల్లో ఇన్నోవేషన్ అండ్ లర్నింగ్ సెంటర్‌లను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠాలతోపాటు ఆవిష్కారాలపై అవగాహన కల్పించడం, నైపుణ్యం పెంపొందించేందుకు ఇవి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని, మొబైళ్లకు బానిస కారాదని హితవు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (పీఈ) డి మునిరాజు, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ డిజిటల్ ఈక్వలైజర్ ప్రాజెక్టు డైరెక్టర్ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్న మంత్రి

పటాలమ్మకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

హొసూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హొసూరు సరిహద్దులోని పటాలమ్మ ఆలయంలో ఆషాఢ శుక్రవారం పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. నెరలూరు, చందాపుర, ఎప్పకోడి, మాయసంద్ర, సర్జాపుర, అత్తిబెలె, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 30 గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు.

అన్నా డీఎంకే సాధనలపై కరపత్రాల పంపిణీ

హొసూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే గత ప్రభుత్వ విజయాలను తెలిపే కరపత్రాలను స్థానికులు, వ్యాపారులకు పంపిణీ చేశారు. అమ్మ పెరవై జిల్లా కార్యదర్శి చిట్టి జగదీశ్ అధ్యక్షత వహించగా, హొసూరు యూనియన్ కార్యదర్శి రవికుమార్ పర్యవేక్షించారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, అమ్మ పెరవై రాష్ట్ర ఉపకార్యదర్శి కలసప్పక్కం, పన్నీర్ సెల్వం పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కార్యకర్తలు, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పెరవై జిల్లా జాయింట్ సెక్రటరీ సెల్వం, యునైటెడ్ డిప్యూటీ సెక్రటరీ రమేశ్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా ప్రథమ దర్శనం

గూగూడుకు తరలి వచ్చిన భక్తులు



ప్రథమ దర్శనానికి తరలి వచ్చిన భక్తులు




నార్పల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే దాచి పెట్టిన కుళ్లాయి స్వామి పీరును ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా బయటకు తీశారు. పీరును అత్తరు, పన్నీరు, గంధంతో శుద్ధి చేసి భక్తులకు దర్శనం చేయించారు. కుళ్లాయి స్వామి ప్రథమ దర్శనం కావడంతో నార్పల మండలంతో పాటు తాడిమర్రి, బత్తలపల్లి, శింగనమల, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ పాల్గొన్నారు.

మరింత సబ్సిడీ వేరుశనగ ఇవ్వండి

బయట మార్కెట్‌లో కొనలేకపోతున్నాం

నిబంధనలు సడలించి పంపిణీ చేయండి

రైతుల వేడుకోలు



వేరుశనగ సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

మడకశిర, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలు సడలించి సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, వర్షాభావం, పంటలు దెబ్బతినడంతో ఖరీఫ్‌లో వేరుశనగ సాగు తగ్గుతూ వచ్చింది. అష్టకష్టాలు పడి రైతులు సాగుకు సిద్ధం చేసుకున్నా వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు వేరుశనగ పంట సాగు చేయలేక పోయారు. ఖరీఫ్ ప్రారంభమై ఇప్పటికే 15రోజులు కావస్తోంది. గత సంవత్సరం ఈ సమయానికి 25 శాతం పంటలను సాగు చేశారు. ఈఏడు ఖరీఫ్‌లో 5 శాతం కూడా పంటలు సాగుకు నోచుకోలేదు. బోరు, బావుల కింద మాత్రం రైతులు పత్తి, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేశారు. కొంతమంది రైతులు మూడు రోజులు కిందట కురిసిన కొద్ది పాటి వర్షానికి వేరుశనగ పంటను సాగు చేశారు. రెండు నుంచి మూడు, నాలుగు ఎకరాలు ఉన్న రైతులు విత్తనం సమకూర్చే పనిలో ఉన్నారు. బయట మార్కెట్‌లో ధర అధికంగా ఉందని సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేయాలని కోరుతున్నారు. మడకశిర మండలానికి 11305 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించారు. నియోజకవర్గంలో 22వేల హెక్టార్లలో వేరుశనగను సాగు చేస్తారు. ప్రస్తుతం కేటాయించిన వేరుశనగ 6వేల హెక్టార్లలో సాగు చేసేందుకు ఉపయోగపడుతుంది. మిగతా 14 వేల హెక్టార్లలో వేరుశనగ పంట వేసేందుకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. మడకశిర మండలానికి 3361 క్వింటాళ్లకుగాను 3347 క్వింటాళ్ల వేరుశనగను, అగళి మండలానికి 1553గాను 1517 క్వింటాళ్లు, అమరాపురం మండలానికి 2555గాను 2420కింటాళ్లు, గుడిబండకు 2192 క్వింటాళ్లకుగాను 2192 క్వింటాళ్ళ విత్తనం పంపిణీ చేశారు. రొళ్ల మండలానికి 1644 క్వింటాళ్లకుగాను 1621 ఇచ్చారు. నిబంధనలు సడలించి వేరుశనగ సాగుకు అవసరం ఉన్నంత మేర పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. సబ్సిడీ వేరుశనగను బయట మార్కెట్‌లో సబ్సిడీపోను క్వింటాళ్ రూ.5580లు ఉండగా బయట మార్కెట్‌లో క్వింటాళ్ రూ.8వేల వరకు ధర పలుకుతోంది. అయితే విత్తనాలు కేజీ 110 నుంచి 120 ధర ఉంది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయామని అధిక ధర పెట్టి విత్తనాలు కొన లేక పోతున్నామని రైతులు అంటున్నారు. రైతులకు సరిపడ వేరుశనగనుపంపిణీ చేయాలని కోరుతున్నారు.

బయట కొనలేకపోతున్నా

నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ ఎకరాలో సాగు చేసేందుకు సరిపోతుంది. మిగతా ఎకరాలో సాగు చేయాలంటే బయట మార్కెట్ అధిక ధర పెట్టి కొనుగోలు చేయాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొనలేకపోతు న్నాం. ప్రభుత్వం స్పందించి సబ్సిడీతో వేరుశనగను అందించాలి.

-రైతు, శికుమార్, వజ్రహట్టి, రొళ్ల

11305 క్వింటాళ్లు పంపిణీ చేశాం

40 శాతం సబ్సిడీపోను రూ.5580లతో క్వింటాళ్ల వేరుశనగను రైతులకు అందిస్తున్నాం. నియోజకవర్గంలో 11305 క్వింటాళ్ళ వేరుశనగను పంపిణీ చేయడం జరిగింది. వేరుశనగను జూన్ 15 నుంచి జులై 15 వరకు సాగు చేసుకోవచ్చు.

-తిమ్మప్ప, వ్యవసాయశాఖ అధికారి

ఆగివున్న లారీని ఢీకొన్న ఓల్వో బస్సు

● ఆరుగురికి తీవ్రగాయాలు



లారీని వెనుక నుంచి ఢీకొన్న బస్సు

చిలమత్తూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఓ ప్రైవేటు ఓల్వా బస్సు ఢీకొనడంతో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాదు నుంచి బెంగళూరుకి శుక్రవారం తెల్లవారుజామున విజయానంద్ ఓల్వా బస్సు వెళుతోంది. 44వ జాతీయ రహదారిపై కోడూరు తోపు సమీపంలో కట్టుకాలువ వద్ద లారీ రోడ్డు పక్కనే ఆగి ఉంది. అయితే వేగంగా వచ్చిన బస్సు ఆగివున్న లారీని గుర్తించలేక వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జైంది. ప్రమాదంలో బస్సు ముందు సీట్లలో కూర్చొన్న ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనంలో వారిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలనీ, ఆ మేరకు అనుకూల వాతావరణం కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇచ్చి, పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2020-23, 2023-27 పాలసీలో 17 యూనిట్లకు రూ.1.14 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారన్నారు. అనంతరం వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీటీఓ మురళీమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి, డీటీసీ వీర్రాజు పాల్గొన్నారు.

నేడు ఆఖరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను శనివారం 1,20,001 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి తెలిపారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000వరకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు 415 మంది విద్యార్థుల హాజరైనట్లు పేర్కొన్నారు. వారికి సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

174 మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు స్థానచలనం



కౌన్సెలింగ్‌కు హాజరైన వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గందరగోళం నడుమ మున్సిపల్ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక జీసెస్‌నగర్‌లోని జయమనెమ్మ కల్యాణమండపంలో 12మున్సిపాలిటీల పరిధిలోని సచివాలయ అడ్మిని స్ట్రేటివ్ సెక్రటరీలకు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తయినవారు 219మంది, స్పౌజ్ ఇతర విజ్ఞప్తుల మేరకు 93 మంది బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 11మున్సిపాలిటీలలో మున్సిపాలిటీ యూనిట్‌గా బదిలీ చేపట్టారు. అనంత నగరపాలక సంస్థలో మాత్రం వార్డు సచివాలయం యూనిట్‌గా బదిలీ చేపట్టడంతో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఇందుకు నిరాకరించారు. నగరపాలక సంస్థలో 38 ఖాళీలు ఉండగా, 23మాత్రమే పొందుపరిచి, మరో 15ని బ్లాక్ చేయడాన్ని జేఏసీ నాయకులు తప్పుబట్టారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా 174మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను బదిలీ చేశారు.

నేడు మూడు ప్రాంతాల్లో కౌన్సెలింగ్

మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఐదు కేటగిరీల ఉద్యోగులకు నగరంలోని మూడు ప్రాంతాల్లో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణ మండపంలో ఉదయం 9గంటలకు వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. తపోవనం సర్కిల్‌లో ఉన్న పుష్ప ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటలకు వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం 2గంటలకు వార్డు అమెనిటీస్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అనంత నగరపాలక సంస్థ నూతన కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 9గంటలకు వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

తండాలోకి దూసుకెళ్లిన బస్సు.. తప్పిన పెనుప్రమాదం



ప్రమాదానికి గురైన బస్సు

గోరంట్ల, జూన్27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెంగుళూరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం మిషన్ తండా వద్ద బస్సు అదుపు తప్పి తండాలోకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న గ్రీన్‌లైన్ బస్సు మిషన్ తండా వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న క్యాటర్ లారీని తప్పించే ప్రయత్నంలో వేగంగా తండాలోకి దూసుకెళ్లింది. ఓ మరుగుదొడ్డిని ఢీకొని ఆగింది. అయితే ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అక్కడే విద్యుత్ స్తంభం ఉందని, దానిని ఢీకొని వుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ప్రయాణికులు అన్నారు.

రూ.3కే ట్రాక్టర్ మట్టి: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు ఎరువుగా వాడే చెరువు మట్టి తరలించుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.3 చెల్లిస్తే చాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అధికారులతో మంత్రి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువు మట్టి తరలించాలంటే స్థానిక వైసీపీ నాయకుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేద న్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రూ.59 కోట్లతో పెనుకొండ నియోజకవర్గంలో 26చెరువుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిని మాయమాటలతో వెంకటరమణ పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి యత్నిస్తుండగా స్థానికులు గమనించి మందలించారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రధాన నిందితుడి అరెస్ట్

దళిత బాలికపై అత్యాచారం కేసులో

నిందితులందరూ దొరికారు

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు ప్రత్యూష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 5న ఈ కేసు వెలుగు చూసిన వెంటనే 17 మందిపై కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను 9న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 10న మరో ఏడుగురు నిందితులను కూడా రిమాండ్‌కు పంపారు. 11న మరో ముగ్గురు పెద్దమనుషులను నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రత్యూష్ పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే పోలీసులు ప్రత్యూష్‌పై ప్రత్యేక నిఘా ఉంచి అతడి స్నేహితుని ద్వారా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడు కర్ణాటకలోని ఓ టీకొట్టులో పని చేస్తు కంబదూరుకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో నమోదైన నిందితులందరినీ అరెస్టు చేసినట్లయింది. కాగా ఇదే కేసుల ఓ అరెస్టయిన ఓ బాలుడికి బెయిల్ మంజూరైనట్లు తెలిసింది.

కూటమి పాలనపై ఏడాదిలోపే వ్యతిరేకత

వైసీపీ సమన్వయకర్త సజ్జల



సజ్జల రామకృష్ణారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోపే తీవ్ర ప్రజావ్యతిరేకత వచ్చిందని వైసీపీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యార్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో జగన్ నామస్మరణ చేయడం తప్ప.. అభివృద్ధి ఊసే మరిచారన్నారు. చంద్రబాబు మోసాలను గుర్తు చేసేందుకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందులో స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలన్నీ వస్తాయన్నారు. అనంతరం రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే రాయలసీమలో స్వీప్ చేస్తామన్నారు. టీడీపీ అనుకూల సర్వేల్లోనే రాయలసీమలో ఎమ్మెల్యేల అవినీతి పరాకాష్టకు చేరిందని ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమన్వయకర్తలు అనంతవెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు నరేష్, మాజీ మంత్రి శైలజానాథ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, సమన్వయకర్తలు దీప, ఈరలక్కప్ప పాల్గొన్నారు.

ఆరుగురికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణ తేజ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వత్థనాయుడు, జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్, పెద్దవడుగూరు పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఫణిశేఖర్‌రెడ్డి, పరిగి ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్‌భాస్కర్‌లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చి ఉమ్మడి జిల్లాకే కేటాయించారు. సోములదొడ్డి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రవిచంద్రను ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అయితే ఉమ్మడి జిల్లాలో మరో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం ఖాళీగా ఉండటంతో ఇక్కడికే కేటాయించాలని కమిషనర్‌ను కోరనున్నట్లు తెలిసింది. అలాగే కర్నూలు జిల్లా నుంచి ఎంపీడీఓగా అజయ్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయించారు.

నేడు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ..

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించను న్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో అనంత జిల్లా ఎస్ఈ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ, సూపరింటెండెంట్ ఖాజా ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టను న్నారు. ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సర్క్యూ లర్ జారీ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు..

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్లు) పంచాయతీ కార్యదర్శులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించ నున్నారు. జడ్పీలో ఉమ్మడి జిల్లా డీపీఓలు నాగరాజనాయుడు, సమత, డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, శివనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు గ్రేడ్-6 కార్యదర్శులు (డిజిటల్ అసిస్టెంట్లు), మధ్యాహ్నం గ్రేడ్-5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సెలవులో రామగిరి సీఐ

వ్యక్తిగతమా...? రాజకీయా ఒత్తిళ్లా?

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామగిరి సీఐ శ్రీధర్ సెలవులో వెళ్లారు. ఆయన శుక్రవారం నుంచి 20 రోజుల పాటు సెలవుపెట్టినట్లు సమాచారం. ఉన్నపళంగా సీఐ సెలవులో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలా...? లేక రాజకీయ ఒత్తిళ్లతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. రామగిరి మండలంలో వరుస పరిమాణాల నేపథ్యంలో సీఐ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు సమాచారం. ముఖ్యంగా పాపిరెడ్డిపల్లిలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య, జగన్ పర్యటనలో కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద చోటుచేసుకున్న సంఘటనలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీనికితోడు రామగిరి మండలంలో ఓ బాలికపై అత్యాచార సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల సూచనతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. ఈ కేసుల దర్యాప్తు వేగంగా, సక్రమంగా సాగలేదన్న కారణాలు కూడా ఉండవచ్చని అంటున్నారు. సీఐ శ్రీధర్ తిరిగి ఇక్కడ విధుల్లోకి చేరుతారా లేదా అన్న సందేహం తలెత్తుతోంది. సెలవు విషయంలో సీఐ వివరణ కోసం ప్రయత్నించగా, ఆయన ఫోన్ స్విచ్చాఫ్ వస్తోంది.

నలుగురు పిల్లలతో తల్లి అదృశ్యం

ధర్మవరం రూరల్, జూన్27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భార్య శ్రావణి తన నలుగురు ఆడపిల్లలతో ఈ నెల 25న అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆమె తండ్రి శివయ్య శుక్రవారం ధర్మవరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 25న తన పిల్లలను హాస్టల్‌లో చేర్పించేందుకు ఆటోలో ధర్మవరానికి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త విజయ్‌కుమార్ ఆమె తండ్రికి విషయం తెలియజేశారు. రెండు రోజులుగా ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శ్రావణి పుట్టినిల్లు కడప జిల్లా యర్రగుంట్ల.

తండ్రిపై కుమారుడి దాడి

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో తండ్రిపై కుమారుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. కిష్టప్ప, శంకరప్ప తండ్రీకొడుకులు. శంకరప్ప తరచూ మద్యం సేవించేవాడు. ఇందుకోసం డబ్బుకావాలని తండ్రిని వేధించేవాడు. మద్యం కోసం డబ్బు ఇవ్వనని కిష్టప్ప చెప్పడంతో శుక్రవారం ఉదయం శంకరప్ప తండ్రిపై కొడవలితో దాడిచేశాడు. కిష్టప్ప కుప్పకూలడంతో మృతి చెందాడని శంకరప్ప అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు కిష్టప్పను 108సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. శంకరప్పను అదుపులోకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

తాడిపత్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు నెల రోజుల కిందట చిన్నకుళ్లాయప్ప తనపై అత్యాచారానికి యత్నించినట్లు ఓ మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులతో పాటు గ్రామ పెద్దలు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈక్రమంలోనే కొద్ది రోజులు గ్రామం విడిచి దూరంగా ఉండాలని సూచించారు. దాంతో చిన్న కుళ్లాయప్ప సొంతూరు వదిలి వేరేఊరిలో ఉంటున్నాడు. దీంతో సమస్య సద్దుమణిగింది. శుక్రవారం బోడాయిపల్లికి వచ్చి తన పొలంలో పని చేసుకుంటున్నాడని ఆ మహిళ బంధువులకు చెప్పింది. దీంతో వారు పొలం వద్దకు వెళ్లి చిన్నకుళ్లాయప్పపై దాడి చేశారు. తన అన్న బాలయ్యతో కలిసి చిన్నకుళ్లాయప్ప ఎదురుదాడి చేశాడు. ఈక్రమంలో కుళ్లాయప్పతో పాటు మహిళ బంధువులు రంగనాథ, రాకేష్, రంగసుధాకర్ గాయపడ్డారు. వీరికి తాడిపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యశ్విత సురక్షితం.. నేడు కదిరికి..

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేరళలో తల్లిదండ్రులు అమ్మేసిన పసిపాప యశ్వితా బాయి(3)ని కదిరి పోలీసులు రక్షించారు. కదిరి మండలం మరవ తండాకు చెందిన శ్రీవాణి, రవీంద్ర నాయక్ దంపతులు ఉపాధి కోసం కేరళకు వెళ్లి, అక్కడ తమ కూతురును వదిలేసి వచ్చారు. పాప ఎక్కడ అని యశ్విత గురించి తాత ఆరా తీయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు గురువారం రాత్రి పాప తల్లిదండ్రులను కేరళకు తీసుకెళ్లారు. కొట్టాయం జిల్లా తిరువళ్లూరులో రాజేష్ అనే వ్యక్తి వద్ద ఉన్న పాపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కదిరికి శనివారానికి చేరుకునే అవకాశం ఉంది. కాగా, పాపను తాము అమ్మలేదని, కొన్నిరోజులు తమ వద్ద వదిలి వెళ్లాలని కోరడంతో విడిచిపెట్టి వచ్చామని చెబుతున్నారు. కానీ పాపను అమ్మినందుకే గొడవ జరిగిందని బంధువులు అంటున్నారు. తాత నిలదీయడంతో యశ్విత తిరిగి తల్లిదండ్రులు, తన ఇద్దరు అన్నల చెంతకు చేరుతోంది.

చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు (గ్రైరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.31,100 అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.15వేలు, సరాసరి రూ.20వేలకు విక్రయాలు జరిగాయన్నారు.

200 మంది ఎంపిక: జేసీ

గోరంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ అకాడమీలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 200 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం తెలిపారు. నాసిన్ అకాడమీలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల వంతున లాటరీ పద్ధతిలో 200 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి జేసీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అడ్మిషన్ల కోసం 714మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఎంపికైన వారి జాబితాను నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ పాల్గొన్నారు.



డ్రాలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్

చెరువు గట్లను పటిష్టం చేయాలి

- ఎమ్మెల్యే సింధూరారెడ్డి



లబ్దిదారులతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని చెరువుల గట్లను పటిష్టం చేసి ప్రతిఎకరాకు నీరందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో అన్నాక్యాంటీన్ వెనుకభాగాన నూతనంగా జలవనరులశాఖ కార్యాలయాన్ని ఆమె మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజక వర్గంలో 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. అనంతరం 18, 19, 20 వార్డు సచివాలయాలను తనిఖీచేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఈ గంగాధర్, ఏఈ జమునాబాయి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు రామాంజనేయులు, బెస్తచలపతి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోయిన పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొండంత అండగా ఉన్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 10,12,909 చెక్కులను మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి అందచేశారు. డబ్బును సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ట్యాబులు..

మెప్మా సంఘాల ఆర్పీలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘనాధరెడ్డితో కలసి ట్యాబులను అందచేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 26 మంది ఆర్పీలకు ట్యాబులను అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ పీసీ గంగన్న, మెప్మా కోఆర్డినేటర్ రమాదేవి, ప్రశాంతిపట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


అంగన్‌వాడీలలో సామూహిక అక్షరాభ్యాసం

బత్తలపల్లి జూన్27.(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలోని 1 నుంచి 4వ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ చంద్రమ్మ తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

పీవీ నరసింహారావు (జయంతి)



దేశ ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించిన తొలి దక్షిణాది వ్యక్తి, తెలుగువాడు, పాములపర్తి వేంకట నరసింహారావు 1921 జూన్ 28న వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లిలో జన్మించారు. పీవీగా పేరొందిన ఆయన బహు భాషా వేత్త, రచయిత. కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎన్నో హోదాలలో కొనసాగారు. దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తెచ్చారు. 1971-73ల మధ్య నాల్గో ముఖ్యమంత్రిగాను, 1991-96ల మధ్య తొమ్మిదో ప్రధానమంత్రిగా కొనసాగారు. మైనారిటీ ప్రభుత్వానికి నేతృత్వం వహించి అపర చాణుక్యుడిగా పేరొందారు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయి పడగలు హిందీ అనువాదం 'సహస్రఫణ్' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2004 డిసెంబరు 23న కన్నుమూశారు.

ముళ్ళపూడి వెంకటరమణ (జయంతి)



ముళ్ళపూడి వెంకటరమణ 1931 జూన్ 28న తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించారు. తెలుగు నవలలు, కథలు, సినిమా కథలు, హాస్యకథలు రాశారు. ప్రత్యేకించి హాస్య రచయితగా పేరొందారు. ఆయన రచనలకు ప్రముఖ చిత్రకారుడు బాపు తనదైనశైలిలో చిత్రాలు అందించారు. దీంతో 'బాపు-రమణ' ద్వయంగా పేరొందారు. ప్రత్యేకించి ఆయన రాసిన 'బుడుగు' బాల సాహిత్యంలో పేరు గడించింది. రాజాలక్ష్మీ సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆయన ఆత్మకథ 'కోతి కొమ్మచ్చి' అనే పుస్తకరూపంలో వెలువడింది. 2011 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

ముహమ్మద్ యూనస్ (పుట్టినరోజు)



బంగ్లాదేశ్ నుంచి తొలి నోబెల్ పురస్కారం అందుకున్న ముహమ్మద్ యూనస్ 1940 జూన్ 28న జన్మించారు. సంఘ సంస్కర్తగాను, బ్యాంకర్‌గాను, ఆర్థిక వేత్తగా రాణించడమే గ్రామీణ బ్యాంక్ స్థాపించి ఈ రంగంలో ఆయన ప్రవేశపెట్టిన విధానాలకు 'నోబెల్ ప్రైజ్ ఫర్ పీస్' అందుకున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, చాన్స్‌లర్‌గా సేవలందించారు. ఆర్థిక అంశాలకు సంబంధించి పలు పుస్తకాలు ప్రచురించారు. యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్‌కు సంబంధించి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఒకరిగా సేవలందించారు.

విశాల్ దాడ్లని (పుట్టినరోజు)



విశాల్ దాడ్లని 1973 జూన్ 28న బాంబేలో జన్మించారు. గాయకుడు, గేయ రచయిత, సంగీత స్వరకర్తగా రాణించారు. బాలీవుడ్‌లో విశాల్ - శేఖర్ రావ్ జియాని ద్వయం ఎంతో పేరొందింది. ఝంకార్ బీట్స్, బ్లఫ్ మాస్టర్, సలాం నమస్తే వంటి సినిమాలు ఆయనకు గుర్తింపు ఇచ్చాయి. 60కుపైగా సినిమాలకు సంగీతం అందించగా 300కు పైగా పాటలు విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా వెయ్యికిపైగా సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. వీరి ద్వయం ఫిల్మ్‌ఫేర్, ఐఐఎఫ్ఏ అవార్డ్స్, మిర్చీ మ్యూజిక్ అవార్డ్స్ తదితర పురస్కారాలు అందుకున్నారు. బుల్లి తెరపై సరిగమప వంటి కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

కెంపేగౌడ ఆదర్శాలు అనుసరణీయం



చింతామణిలో కెంపేగౌడ వేషధారి



కళాబృందాల సందడి



శిడ్లఘట్టలో కెంపేగౌడ జయంతి



చింతామణిలో శకటాల ఊరేగింపు

» వాడవాడలా కెంపేగౌడ జయంతి

చింతామణి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర నిర్మాత నాడప్రభు కెంపేగౌడ ఆదర్శాలు నేటికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. తాలూకా జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో నాడప్రభు కెంపేగౌడ 516వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రవాసి మందిరం వద్ద కేఎస్ఆర్టీసీ శకటాల నమూనాలకు తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ పూజలు చేసి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలనుంచి 25కుపైగా శకటాలు ర్యాలీలో పాల్గొన్నాయి. వెండి రథంలో కెంపేగౌడ విగ్రహాన్ని కొలువుదీర్చి అలంకరించిన వాహనాలను ఊరేగించారు. ఆర్టీసీ బస్సులకు కెంపేగౌడ చిత్రపటాలను అమర్చి పూజలు చేశారు. కన్నడ పతాకం, బెలూన్లతో ముస్తాబు చేశారు. బాణాసంచా కాల్చారు. మరోవైపు మాళపల్లి నివాసి వైసీ గౌతమ్‌రెడ్డి అనే యువకుడు కెంపేగౌడ వేషధారణతో ఖడ్గం చేతబట్టి గుర్రంపై స్వారీ చేయడం ఆకట్టుకుంది. కళాబృందాలు, కీలుగుర్రాలు, గారడీబొమ్మలు, వీరగాసె, ఆంధ్రప్రదేశ్ చెక్కభజన బృందం వివిధ జానపద బృందాలు పాల్గొన్నాయి. ప్రజలతోపాటు ఒక్కలిగ సామాజికవర్గవారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ కారణంగా పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో...

బొమ్మనహళ్ళి(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్ఎస్ఆర్ లే అవుట్ కూల్‌జాయింట్ సర్కిల్‌లో నాడప్రభు కెంపేగౌడ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బొమ్మనహళ్ళి గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్య క్రమాలు కొనసాగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ ఉగ్రప్ప మాట్లాడుతూ బెంగళూరు నగర నిర్మాత నాడప్రభు కెంపేగౌడ ఆదర్శాలు అనుసరణీయమన్నారు. బెంగళూరు నగరం కిలోమీటర్ల కొలదీ అభివృద్ధితో విస్తరించడానికి శతాబ్దాల క్రితమే కెంపేగౌడ వేసిన పునాదులన్నారు. నగరం అన్నివైపులా చెరువులు నిర్మించారన్నారు. నగరంలో వివిధరాష్ట్రాలు, దేశాల వారు నివసిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఒక్కలిగసంఘం మాజీ అధ్యక్షుడు రవీంద్ర, రాఘవేంద్ర, జగదీశ్, బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, చిక్కణ్ణ, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

కాగా బెంగళూరు నగర, గ్రామీణ, కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లోని పలు తాలూకా కేంద్రాలలో కెంపేగౌడ జయంతి కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి.



బీబీఎంపీ ఆధ్వర్యంలో బండిదేవర ఉత్సవం



దేవనహళ్ళి తాలూకా విజయపురలో ...



ఎడ్లబండిపై వస్తున్న గ్రామస్థులు, పెద్దసంఖ్యలో ప్రజలు



ముళబాగిలులో కెంపేగౌడ జయంతి

చాముండి కొండపై రద్దీ



ఆలయం బయట భారీ క్యూ



ఆలయం లోపల సైతం క్యూలో భక్తులు

» అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మైసూరు చాముండి కొండలపై ఆషాఢం తొలిరోజున అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారుల తీరును తప్పుబట్టారు. శుక్రవారం చాముండేశ్వరి దేవి దర్శనానికి కర్ణాటకతోపాటు వివిధ రాష్ట్రాలతోపాటు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. 2వేల రూపాయల వీవీఐపీ దర్శనానికి ప్రాధాన్యత ఇచ్చిన పాలకవర్గం సామాన్యులను విస్మరించిందని మండిపడ్డారు. రాత్రి 12 గంటలకే కొండపైకి చేరుకున్నా ఉదయం దాకా దర్శనం కాలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆషాఢంలో తొలిరోజు శుక్రవారం రావడంతో కొండపై జనసంద్రమైంది. భక్తుల అనుకూలం కోసం 300 రూపాయల టిక్కెట్ ఉన్నా గంటలతరబడి క్యూలో ఉండాల్సి వచ్చింది. ఆలయ అధికారుల తీరును భక్తులు తప్పుబట్టారు. కొండపైకి నడిచివచ్చే వారికోసం శౌచాలయాలు, తాగునీరు సౌలభ్యం కల్పించామని గొప్పలు చెప్పినా ఆచరణలో అమలు చేయాలని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టాలని భక్తులు డిమాండ్ చేశారు.

సుస్థిర అభివృద్ధికి కళలు



కళాఖండాలను వీక్షిస్తున్న విద్యార్థులు

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యానికి కళలు దోహదపడతాయని థ్రూ ఆర్ట్స్ ఇండియా రెండో ఎడిషన్‌లు పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బెంగళూరు కాన్రాడ్స్‌లో 17మంది గ్లోబల్ కళాకారులు ప్రపంచసంస్థ 17 సుస్థిర లక్ష్యాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మారిషస్ కళాకారుడు జహిరాముత్తి స్థాపించిన 15కుపైగా దేశాలలో హుమేరా అలి స్టూడియోస్ బ్యానర్ ఆధ్వర్యంలో కళాఖండాల ప్రదర్శన సాగుతోందన్నారు. ప్యారిస్ నుంచి సీషెల్స్, దుబాయ్ నుంచి ఢాకా వరకు ప్రపంచస్థాయి సవాళ్ళు అనే అంశంపై జాగృతి కల్పిస్తున్నట్టు తెలిపారు. కళాఖండాల వేలంలో వచ్చే ఆదాయాన్ని దేశాలలో పేద సముదాయాల విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. కళాఖండాలతో యువతలో చైతన్యం తెస్తున్నామన్నారు. లేడీస్ సర్కిల్ ఇండియా, రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థలు సహకారం అందిస్తున్నాయన్నారు.

ఓంశక్తి పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రాం నగర్ బీపీడీసాలప్ప కాలనీలో జ్యేష్ఠ అమావాస్యను పురస్కరించుకుని గురువారం సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. పర్యావరణ ప్రేమికులు ఈశ్వర్ ఎస్ రాయుడు నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి. 108 మంది ముత్తైదువులు పసుపు, కుంకుమలతో అర్చన చేశారు. అర్చకులు ఓంశక్తి శశి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా పర్వదినాలకు అనుగుణంగా ఆలయంలో విశేషపూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

అగరలో పూరీ జగన్నాథ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహళ్ళి జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పూరి జగన్నాథ రథోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అగరలో వెలసిన జగన్నాథ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. జై జగన్నాథ భక్తుల నినాదాలతో హోరెత్తింది. పూరిలో నిర్వహించే తరహాలో ఇక్కడ పూజలు, రథోత్సవం నిర్వహించడంతో వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ఒడిశ్శావాసులతోపాటు నగరంలో ఉంటున్న వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. వీరిని నియంత్రించడానికి వందలమంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

వైట్‌ఫీల్డ్‌లో...

మహదేవపుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కుందలహళ్ళి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇస్కాన్ వైట్‌ఫీల్డ్ ఆధ్వర్యంలో ఇదే తొలిసారిగా జగన్నాథయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రి అరవింద లింబావళి విశేషపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ధార్మిక పరంపర శ్రేష్ఠతకు ఇది నిదర్శనమని, శాంతి, సహనం, సన్మార్గంలో సాగేందుకు ఇది పాఠమన్నారు. ఇదే సందర్భంగా స్థానికంగా ఉంటున్న ఇతర రాష్ట్రాలవారు కన్నడ నేర్చుకోవాలని సూచించారు. ఇస్కాన్ బెంగళూరు ఉపాధ్యక్షుడు శ్యామవల్లభ, బాగ్‌మనె గ్రూప్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఇస్కాన్ బెంగళూరు ఉపాధ్యక్షులు చంచలపతి ప్రభు తదితరులు పాల్గొన్నారు. కాగా మున్నేకొళ్లాళ సర్కిల్‌లో నిర్వహించిన జగన్నాథ యాత్రలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి పాల్గొన్నారు. ఉత్సవం లో బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.



రథోత్సవంలో మాజీ మంత్రి అరవింద లింబావళి

నగరాభివృద్ధి ప్రాధికారుడు కెంపేగౌడ - ఎమ్మెల్యే వెంకటేశ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

పావగడ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర అభివృద్ధి ప్రాధికారుడు కెంపేగౌడ అని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో నిర్వహించిన కెంపేగౌడ జయంతిని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కెంపేగౌడ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు.

శివాపురంలో కార్డెన్‌సెర్చ్

మడకశిర టౌన్, జూన్27(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని శివాపురంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. నాటుసారా, అక్రమ మద్యం అమ్ముతున్నట్లు అనుమానం ఉన్న నేపథ్యంలో తనిఖీలు చేశారు. అనంతరం శివాపురం కాలనీ వాసులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సీఎం సహాయనిధి.. బాధితులకు వరం

-మంత్రి సవిత

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఒక వరమని మంత్రి సవిత అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 34మందికి రూ.59.92 లక్షల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏడాది పాలనలో 155మందికి రూ.1,29,35,000 నగదును చెక్కుల రూపంలో అందించామన్నారు. ఈ సందర్భంగా పెనుకొండ, గోరంట్ల, పరిగి, రొద్దం, సోమందేపల్లి ఐదు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలు చెక్కులు అందుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, త్రివేంద్ర, అరుణ్ రెడ్డి, గుట్టూరు నాగరాజు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహేష్ కోరారు. శుక్రవారం మంత్రి సవితను ఆమె స్వగృహంలో కలిసి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అమరప్ప, గోపాల్, రమేష్, శివశంకర్, శ్రీనివాసులు, నాగరాజు, మైలార్, రాము, రాజగోపాల్, మంజునాథ్, బాస్కర్, బద్రియాదవ్ పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో నీట్ పరీక్షలో ర్యాంక్ సాధించిన సంతోష్ నాయక్‌కు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం జూనియర్ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న ఉమాశంకర్ రూ.20వేలు మంత్రి కార్యాలయంలో సవిత చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు.



చెక్కులు అందుకున్న వారితో మంత్రి సవిత

నేటి నుంచి తెలుగు నాటకోత్సవాలు

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తర్వాత తెలుగు విజ్ఞానసమితి ఆధ్వర్యంలో రెండు రోజుల తెలుగు నాటకోత్సవాలు శనివారం ప్రారంభం అవుతాయి. తొలిరోజున ప్రజాదరణ పొందిన పక్కింటి మొగుడు నాటకం ప్రదర్శన ఉండనుంది. కర్ణాటక నాటక అకాడమీ అధ్యక్షులు డాక్టర్ కేవీ నాగరాజమూర్తి ఉత్సవాలను ప్రారంభించనుండగా తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు అధ్యక్షత వహించనున్నారు. రెండోరోజు ఆదివారం పడమట గాలి నాటిక ఉంటుందని నగరంలో నివసిస్తున్న తెలుగు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మిరెడ్డి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి గ్రామంలో శాసనకోట రోడ్డులో నివాసముంటున్న మహిళ ఇంటిపై కప్పుపై ఉన్న రాడ్‌ను తొలగించే సమయంలో విద్యుదాఘాతానికి గురైంది. పెద్దింటి రామాంజినమ్మ ఇంటి పైకప్పుపై బట్టలు ఆరవేసేందుకు వెళ్లి పక్కనే ఉన్న రాడ్‌ను తొలగించే సమయంలో 11కేవీ విద్యుత్‌లైన్‌కు రాడ్ తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. న్యూట్రల్, ఫేస్ ఒకదానికొకటి అర్త్ కావడంతో ఫ్రిడ్జ్, ఫ్యాన్, టీవీ తదితర సామగ్రి కాలిపోయింది. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.





కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

ఇంటింటికీ పోలీస్

● కొత్త పథకం ప్రారంభం

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటింటికీ పోలీస్ అనే కొత్త పథకానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం సీఎం సిద్దరామయ్య లాంచనంగా విడుదల చేశారు. పోలీసు అధికారుల వార్షిక సమావేశంలో రాష్ట్రంలో కొనసాగుతున్న విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆధునిక యుగంలో పోలీసుపాత్ర కీలకమన్నారు. కేవలం శాంతిభద్రతలకు మాత్రమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రజలకు రక్షణ కల్పించేలా పనిచేయాలన్నారు. పోలీసులు, ప్రజలమధ్య సహకారం, నమ్మకం పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. కొత్త పథకం ద్వారా నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పొందేలా చైతన్యం చేయడం, నమ్మకం పెంచడం, పోలీసు వ్యవస్థ సమాజంకోసమే పనిచేస్తోందనే అవగాహన కల్పించదలిచారు. స్థానిక సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేయనున్నారు. పోలీసులంటే భయం అనే వాతావరణానికి స్వస్తి పలికేలా ప్రజలతో ప్రజాస్నేహిగా మారడం, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలు చేపట్టనున్నారు. సమావేశంలో హోం మంత్రి పరమేశ్వర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ పాల్గొన్నారు.


పీఎం కిసాన్ సమ్మాన్‌కు 7లక్షల మంది అనర్హులు

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకానికి నమోదు చేసుకున్నవారిలో 7 లక్షల మందికిపైగా అనర్హులు ఉన్నట్టు గుర్తించారు. రాష్ట్రంలో కిసాన్ సమ్మాన్ పథకం ప్రారంభమైనప్పుడు 53.81 లక్షలమంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. వరుసగా పథకం నుంచి లబ్ధిపొందారు. వీరిలో 7 లక్షలమంది అనర్హులైన లబ్ధిదారులు ఉన్నట్టు గుర్తించి జాబితానుంచి తొలగించారు. భూముల రికార్డుల కొరత, ఈకేవైసీ, ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు రాజ్యాంగబద్ధమైన పలు హోదాలలో కొనసాగుతున్నవారు కిసాన్ సమ్మాన్ లబ్ధిపొందుతున్నట్టు గుర్తించారు. 2018లో కిసాన్ సమ్మాన్ ప్రారంభమైంది. తొలి ఏడాది 19,819 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 2019నాటికి 53,81,184మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత లేనివారు కూడా పేర్లు నమోదు చేసుకున్నట్టు ఇటీవల గుర్తించారు. ప్రస్తుతం తొలగించినవారిని మినహాయిస్తే 47.50లక్షలమంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు.

కంది రైతు.. దిగాలు..!

● కొనుగోళ్లకు వ్యాపారుల వెనుకంజ
● మార్కెట్‌లోకి విదేశీ కంది





బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కందిపప్పు లేకుండా వంటలు ఉండవు. దక్షిణభారతంలో ప్రతి వంటకానికి కందిపప్పు ప్రధానంగా వాడతారు. గత ఏడాది పండిన కంది బేడలు మార్కెట్‌లోకి వచ్చాయి. గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది ప్రారంభంలోనే పుష్కలంగా వర్షాలు కురిశాయి. నైరుతికి ముందే రాష్ట్రంలోని జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఈప్రభావంతో ఖరీఫ్, రబీ పంట కాలాల్లో సాగుచేసే కంది మార్కెట్‌లోకి వస్తే మరింత ధర పడిపోనుందని, ఇటు రైతులు, అటు వ్యాపారులు భావిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో కందిపప్పు ధర ఒక్కసారిగా తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే కిలోకు రూ.60దాకా తగ్గుముఖం పట్టింది. కొనుగోలు చేసి గోడౌన్‌లలో నిల్వ ఉంచేందుకు వ్యాపారులు వెనుకడగు వేస్తున్నారు. మార్కెట్‌లో విదేశీ కంది హల్‌చల్ చేస్తోంది. గత ఏడాది జూన్, జూలైలో గుజరాత్ కందిపప్పు కేజీ రూ.185 దాకా ఉండేది. ప్రస్తుతం రూ.115కే లభిస్తోంది. గుల్బర్గా రకం రూ.170 నుంచి 105కు తగ్గింది. విదేశీ కందిపప్పు రూ.160 ధర పలికింది. ప్రస్తుతం రూ.90కే మార్కెట్‌లో లభిస్తోంది. ఇలా గత ఏడాదితో పోలిస్తే కేజీ కంది పప్పు రూ.60-65దాకా ధర తగ్గింది.

కొనుగోలుదారుల్లో ఆనందం

కందిపప్పు ధర పెరగడంతో కొనుగోలుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా కందిపప్పు నెలకు సరాసరి 4-5కేజీలు కొనుగోలు చేస్తారు. కేవలం కందిపప్పుపైనే రూ.200కుపైగా తగ్గినట్టయ్యింది. గత ఏడాది క్వింటాల్ రూ.12వేల దాకా పెరిగింది. ఈ ఏడాది రూ.6,500-7వేలకు అటుఇటుగా ధర పలుకుతోంది. రాష్ట్రంలో 1.02 లక్షల హెక్టార్లలో కంది సాగవుతోంది. ఏటా 11.96 లక్షల టన్నుల కంది ఉత్పత్తి అవుతోంది. రెండేళ్లక్రితం కంది పంటకు వర్షాభావంతో రోగాలు ప్రబలాయి. గత ఏడాది అధిక వర్షాలతో రోగాలు తగ్గి పంట బాగానే పండింది.

ఉత్తర కర్ణాటకలో అత్యధిక సాగు

రాష్ట్రంలో ఉత్తర కర్ణాటక జిల్లాల్లో కంది అత్యధికంగా సాగు చేస్తారు. మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కంది విస్తారంగా సాగు అవుతోంది. గత ఏడాది దేశమంతటా మంచి వర్షాలతో కంది పంట ఆశాజనకంగా పండింది. ఆ ప్రభావమే కందిపప్పు ధర తగ్గేందుకు కారణమైంది. ఆరేళ్లలో ధరలు తగ్గడం ఇదే తొలిసారి. బర్మా, ఘనా, దక్షిణాఫ్రికా, మయన్మార్, జింబాబ్వేలనుంచి కూడా కందిపప్పు దిగుమతి అవుతోంది. వేసవికాలంలో కందిపపప్పుకు డిమాండ్ సాధారణంగా తక్కువగా ఉంటుంది. మరో నెల రోజుల తర్వాత వరుసగా పండుగలు, సంబరాలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుంది. దీంతో కందిపప్పుకు కొంతమేర అయినా ధరలు పెరుగుతాయని వ్యాపారులు, రైతులు విక్రయించకుండా వేచి చూస్తున్నారు.

సగటున కేజీ రూ.లలో		
కందిపప్పు	గత ఏడాది	ప్రస్తుతం
గుజరాత్ రకం	185	117
గుల్బర్గా ఉత్తమం	170	105
గుల్బర్గా మీడియం	165	105
విదేశీ	160	90
ఇతర ధాన్యాలు		
శనగపప్పు	98	84
పెసలు	120	103
పెసరపప్పు	115	102
మినప పప్పు	140	120
శనగలు	90	70

కొబ్బరి ధరకు రెక్కలు

● ఒకేరోజు క్వింటంపై రూ.3 వేల పెరుగుదల



తిపటూరు మార్కెట్‌లోని ఎండుకొబ్బరి

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిన కొబ్బరి సాగు చేసే రాష్ట్రాల్లో కేరళతోపాటు కర్ణాటక కూడా కీలకమైనది. తుమకూరు, చిక్కమగళూరుతోపాటు పశ్చిమకనుమలకు అనుబంధమైన జిల్లాల్లో కొబ్బరితోటలు విరివిగా సాగు చేస్తారు. గతంలో ఎన్నడూలేని విధంగా కొబ్బరిధరకు రెక్కలొచ్చాయి. రాష్ట్రంలో కొబ్బరి విక్రయాల్లో ప్రధానమైన మార్కెట్ తిపటూరులో ఉంది. క్వింటాల్ రూ.29,118 ధర పలికింది. కేవలం ఒక్కరోజులోనే క్వింటాల్‌కు రూ.3 వేలు పెరిగినట్టు వ్యాపారులు తెలిపారు. వారానికి రెండు రోజులపాటు కొబ్బరి మార్కెట్ తిపటూరులోని ఏపీఎంసీలో కొనసాగుతుంది. నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది పంట దెబ్బతింటుందని భావిస్తున్నారు. మరోవైపు ఉత్తరభారతంలో ఎండుకొబ్బరికి డిమాండ్ పెరిగింది. సోమవారం నాటి మార్కెట్‌కంటే గురువారం క్వింటాల్‌కు రూ.3వేలు పెరిగింది. రెండు నెలల్లో రూ.11వేల దాకా ధర పెరిగినట్టు వ్యాపారులు తెలిపారు. ఉత్తరభారత్‌లో కొబ్బరికి బాగా డిమాండ్ పెరిగింది. తమిళనాడు, కేరళలలో దిగుబడి తగ్గడమే ధర పెరిగేందుకు కారణమైనట్టు తెలుస్తోంది. మార్కెట్‌కు వచ్చిన కొబ్బరి తక్కువగానే ఉంది. గత ఏడాదితో పోలిస్తే జూన్‌లో మార్కెట్‌కు వచ్చిన కొబ్బరి భారీగా తగ్గినట్టు ఉంది. గురువారం 5,904 సంచులలో 2,538 క్వింటాళ్ల కొబ్బరి మార్కెట్‌కు వచ్చింది. మూడు రోజులక్రితం సోమవారం 7,795 సంచులలో 3,351 క్వింటాళ్ల కొబ్బరి వచ్చింది. ఇలా మార్కెట్‌కు తక్కువ కొబ్బరి రావడం, ఉత్తరభారతంలో డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయి.



కేఆర్ఎస్ ప్రాజెక్టుకు 84 ఏళ్ల రికార్డు

● జూన్‌లో 120 అడుగుల భర్తీ
● 80వేల క్యూసెక్కులు విడుదల

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన కేఆర్ఎస్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. 84ఏళ్ల తర్వాత ప్రాజెక్టుకు జూన్‌లోనే 120 అడుగుల నీటిమట్టం సాధ్యమైంది. కేరళ, కొడగు జిల్లాలతోపాటు పశ్చిమ కనుమలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కావేరి నది ఉద్భవించే తలకావేరి, భాగమంగలలో భారీగా వర్షాలు కురిశాయి. ప్రాజెక్టు 90శాతం భర్తీ అయ్యింది. జూన్ నెలలో ప్రాజెక్టుకు నీరు చేరడమే గగనంగా ఉండేది. 124.8 అడుగుల గరిష్ఠం కావడంతో దాదాపు భర్తీ అయ్యేంతవరకు గేట్లను తెరిచేవారు కాదు. కానీ తమిళనాడుకు కోటా నీరు విడుదల చేయాల్సి ఉంటే మాత్రమే వదిలేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జూన్ నెలలోనే గేట్‌లు ఎత్తిన పరిస్థితి లేదు. మండ్య, మైసూరుతోపాటు కావేరీ నది పరీవాహకంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో సాధ్యమైంది. ఈనెల 23నుంచే క్రస్టగేట్‌లను ఎత్తడం ప్రారంభించారు. అయినా ఇన్‌ఫ్లోలో ఏమాత్రం తేడా లేదనేలా పెరుగుతూనే ఉంది. దీంతో బుధవారం నాటికి 30-40వేల క్యూసెక్కులను విడుదల చేశారు. గురువారం 50వేల క్యూసెక్కులను, తాజాగా శుక్రవారం అంతకుమించి నీటిని వదిలారు. గరిష్ఠ సామర్థ్యానికి 4 అడుగులు ఉండగానే అవుట్‌ఫ్లోను పెంచుతూ వచ్చారు. 1941లో జూన్‌లో నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. ఆ తర్వాత ఏడాది కూడా జూన్‌లో అంతస్థాయికి చేరలేదు. ప్రస్తుతం జూన్ మొదటివారం నుంచి గరిష్ఠస్థాయికి నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. కాగా ఈ నెల 30న కేఆర్ఎస్ డ్యాంకు వాయనం సమర్పించనున్నారు.

10న తుంగభద్ర జలాల విడుదల

ఐసీసీ సమావేశంలో నిర్ణయం



తుంగభద్ర జలాల విడుదలపై బెంగళూరులో ఐసీసీ సమావేశం.. పాల్గొన్న అధికారులు, నాయకులు

బళ్లారి, జూలై 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం నుంచి ఎగువ, దిగువ కాలువలకు జూలై 10న నీరు విడుదల చేయాలని ఐసీసీ నిర్ణయించింది. డ్యాంలో ఉన్న నిల్వల ఆధారంగా నీటిని విడుదల చేయాలని తీర్మానం చేసింది. కర్ణాటకలోని ఆర్‌బీఎంసీ, ఇతర కాలువలకు జూలై 2 నుంచి నవంబరు 31 వరకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. బెంగళూరులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో శుక్రవారం 124వ ఐసీసీ కమిటీ సమావేశం జరిగింది. అధ్యక్షుడు శివరాజ్ తంగడిడే అధ్యక్షత వహించారు. తుంగభద్ర బోర్డు అధికారులు, కమిటీ సభ్యులు హాజరయ్యారు. డ్యాంలో శుక్రవారం 56.746 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. తీర్మానం మేరకు, ఆర్‌బీఎంసీ, కొప్పళ జిల్లా పరిధిలో ఉండే ఆయకట్టుకు జూలై 2 నుంచి 31 వరకు తుంగభద్ర ఎడమ ప్రధాన కాలువ నుంచి రెండు వేల క్యూసెక్కులు వదులుతారు. జూలై 16 నుంచి 31 వరకు మూడు వేల క్యూసెక్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 4100 క్యూసెక్కులు వదులుతారు. కుడి ఎగువ కాలువకు జూలై 10 నుంచి జూలై 31 వరకు సగటున 700 క్యూసెక్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 1300 క్యూసెక్కులు, కుడి దిగువ కాలువకు జూలై 10 నుంచి జూలై 31 వరకు 500 క్యూసెక్కులు, ఆగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు 650 క్యూసెక్కుల నీటిని వదులుతారు. లభ్యత ఆధారంగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేయాలని ఐసీసీ తీర్మానం చేసింది.

2న సీఎంతో చర్చలు

తుంగభద్ర జలాల విడుదల, ఆనకట్టు భద్రత, పంటల సంరక్షణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో జూలై 2 సమావేశం జరుపుతామని ఐసీసీ అధ్యక్షుడు, మంత్రి శివరాజ్ తంగడిగే తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీబీపీ బోర్డు అధికారులు తెలిపారు. దీంతో రబీ సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ అంశంపై మరోసారి సమావేశమై చర్చిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, బోర్డు కర్ణాటక అధికారులు, ఎమ్మెల్యేలు గవియప్ప, పంపనగౌడ బాదర్లి, బసవనగౌడ, మాజీ మంత్రి బి.నాగేంద్ర, సీపీడీఏ అధ్యక్షుడు హసనాసబ్ దోతిహాల్, కె.రాఘవేంద్ర హిట్నాల్, కొప్పళ, బళ్లారి, రాయచూరు, విజయనగర జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

వందే భారత్ రైలులో మంటలు

బెంగళూరు, జూన్27(ఆంధ్రజ్యోతి): ధారవాడ నుంచి బెంగళూరుకు వస్తున్న వందే భారత్ రైలులో మంటలు చెలరేగాయి. శుక్రవారం సాయంత్రం చక్రంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన గేట్‌మ్యాన్ అప్రమత్తం చేశారు. వెంటనే రైలును ఆపేశారు. ప్రయాణికులను రైలు నుంచి కిందకు దింపారు. వందేభారత్ రైలును పూర్తిగా నిలిపివేశారు. ప్రయాణికులను శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో పంపారు.

పులుల మృతికి విషమే కారణం

● ప్రాథమికంగా గుర్తించిన అటవీశాఖ

బెంగళూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా మలె మహదేశ్వర అటవీప్రాంతం గాజనూరు పరిధి హరాగ్యంలో ఒక పెద్దపులితోపాటు 4 పులి పిల్ల మృతికి విషమే కారణమని అటవీశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. మలె మహదేశ్వర కొండల అటవీప్రాంతంలో ఐదు పులులు మృతి చెందినట్టు గురువారం ఫారెస్ట్ వాచర్లు గుర్తించారు. ఐదు పులుల మృతి విషయం తెలియగానే అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తీవ్రంగా పరిగణించారు. సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం అటవీశాఖ అదనపు ముఖ్యకార్యదర్శి, ఫారెస్ట్ ఉన్నతాధికారులు ఆదేశాలతో పశువైద్యాధికారులు, ఫారెస్ట్ రేంజర్లు పులులు మృతి చెందిన ప్రదేశానికి వెళ్లారు. మంత్రి ఈశ్వర్‌ఖండ్రెతోపాటు డీసీఎఫ్ చక్రపాణి, నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ అధికారి సంజయ్‌గుబ్బి, ఏపీసీసీఎఫ్ శ్రీనివాస్, సీసీఎఫ్ హీరేలాల్ పాల్గొన్నారు. 500 మీటర్ల మేర నిషేధిత ప్రాంతంగా గుర్తించి పరిశీలించారు. ఐదుగురు నిపుణుల బృందం, ఎన్‌టీసీఏ మార్గదర్శకాలకు అనుగుణంగా పులులకు పోస్టుమార్టం నిర్వహించారు. పులులు చనిపోయిన ప్రదేశంలోనే ఓ ఆవు కళేబరాన్ని గుర్తించారు. పులుల మృతికి విషమే కారణంగా ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. తదుపరి దర్యాప్తును అటవీ, పోలీసు శాఖలు సంయుక్తంగా కొనసాగించనున్నారు.



పులి కళేబరం



పులుల అంత్యక్రియల్లో మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, అధికారులు

కెంపేగౌడ దూరదృష్టే బెంగళూరు ప్రగతికి పునాది

● సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నాడప్రభు కెంపేగౌడ దూరదృష్టితో బెంగళూరు ప్రగతికి కారణమైందని సీఎం సిద్దరామయ్య అన్నారు. కెంపేగౌడ 516వ జయంతిని కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విధానసౌధ వద్ద కెంపేగౌడ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ వృత్తి ఆధారిత పేటలను ఏర్పాటు చేసిన కీర్తి కెంపేగౌడదే అన్నారు. నగరంలో నీటివనరులు, పచ్చదనం, వ్యాపారం ఇలా సమ్మిళితమయ్యేలా తీర్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎక్కువమంది జయంతులు జరిపిన చరిత్ర ఉందన్నారు. సుమనహళ్లిలో జరిగిన కార్యక్రమంలో కెంపేగౌడ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కెంపేగౌడ జయంతిని పురస్కరించుకుని సుమనహళ్లిలో జరిగిన కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. నగరమంతటా కెంపేగౌడ జయంతి ఓ పండుగలా జరిగిందన్నారు. ఏడువైపులనుంచి జ్యోతులు వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కెంపేగౌడను ప్రజలు స్మరించుకుంటున్నారన్నారు. కెంపేగౌడ కోసం ఒక్కలిగ సముదాయానికి చెందిన మహిళలు జ్యోతులు మోశారు. సాయంత్రం బీబీఎంపీలో నాడప్రభు కెంపేగౌడ పురస్కారాలను డీసీఎం ప్రదానం చేశారు. మీడియా రంగం నుంచి దీపక్ తిమ్మయ్య, బీఎస్ సతీశ్‌కుమార్, రాజేశ్ రై, చిట్ల, సీ మహేశ్‌లకు పురస్కారాలు అందాయి. 51మందికి పురస్కారాలతో సత్కరించారు. సుమనహళ్లిలో జరిగిన కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ, నంజావధూత స్వామీజీ, సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్రస్వామీజీతోపాటు పలువురు పాల్గొన్నారు. మంత్రులు మహదేవప్ప, మునియప్ప, కృష్ణబైరేగౌడ, శివరాజ్ తంగడిగితోపాటు పలువురు భాగస్వామ్యులయ్యారు. కాగా ఉదయం 9 గంటలకే దేవనహళ్లి విమానాశ్రయ ప్రాంగణంలోని కెంపేగౌడ విగ్రహానికి డీసీఎం పూలమాల సమర్పించారు. బీబీఎంపీతోపాటు నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో కెంపేగౌడ విగ్రహాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.



సుమనహళ్లిలో కెంపేగౌడ జయంతిలో సీఎం, డీసీఎం, మంత్రులు



విధానసౌధ వద్ద కెంపేగౌడ విగ్రహానికి సీఎం పుష్పాంజలి



కళాబృందాల సందడి



బీబీఎంపీలో కెంపేగౌడ పురస్కారాల ప్రదానం





భారీ విగ్రహం వద్ద డీసీఎం తదితరులు